సాక్షి సంగారెడ్డి

శనివారం । 22 । మార్చి । 2025





నీడ లేదు.. వైద్యం జాడలేదు


ఉపాధి కూలీలకు నిలువ నీడ కరువైంది. ప్రథమ చికిత్స కిట్లు కానరావడం లేదు.

వివరాలు 8లో ▸



దంచికొడుతున్న ఎండలు

ఈ సారి మార్చిలోనే ఎండలు దంచి కొడుతున్నాయి. దీంతో ప్రజలు వేడి భరించలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వివరాలు 9లో ▸



ఇఫ్తార్	సహర్
శనివారం	ఆదివారం
సా. 6.32 గం.	ఉ. 4.57 గం.

రంజాన్ వేళలు

పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థిని



ఆల్ ది బెస్ట్ చెప్పుకుంటున్న విద్యార్థులు

పరీక్షా సమయం

ఉద్వేగం.. ఉద్విగ్నం

పదో తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది. పరీక్షల తొలిరోజు కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. స్నేహితులు ఒకరికొకరు ఆల్ ద బెస్ట్ చెప్పుకుంటూ కేంద్రం లోపలికి వెళ్లారు. కొంతమంది తల్లిదండ్రులు పరీక్ష ముగిసే వరకు పరీక్ష కేంద్రాల వద్దే నిరీక్షించారు. ఈ ఘటనలన్నింటికీ నిలువెత్తు దృశ్యాలివి.

సాక్షి ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



విద్యార్థులను తనిఖీ చేస్తున్న పరీక్ష సిబ్బంది



కూతురుకి ధైర్యం చెబుతున్న తండ్రి

న్యూస్‌రీల్

హరీశ్‌ను కలిసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు



హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు

జహీరాబాద్ టౌన్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీమంత్రి హరీశ్‌రావుపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు కొట్టివేయడంతో ఎమ్మెల్యే మాణిక్‌రావు, జహీరాబాద్ నాయకులు ఆయనను కలిశారు. హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డితో కలసి హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం మండలాల అధ్యక్షులు తట్టునారాయణ, సంజీవ్‌రెడ్డి, నర్సింలు, వెంకటేశం, నాయకులు మిథిన్‌రాజ్ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే గూడెం



ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్‌లలో నివాసం ఉండే పేదల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హామీనిచ్చారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు డబుల్ బెడ్రూమ్ కేసీఆర్‌నగర్‌లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సేవ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలన్న లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ వైద్యులు, వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారని వివరించారు. ఇక్కడి ప్రజలకు త్వరలో మరింత మెరుగైన సదుపాయాలను కల్పిస్తామని అందుకు తగిన నిధులను కూడా కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి గాయిత్రీదేవి, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి పాల్గొన్నారు.

ఉగాదికే సన్నబియ్యం

- అదే రోజు పథకం ప్రారంభించనున్న ప్రభుత్వం
- ఏప్రిల్ 1నుంచి అమలు
- జిల్లాలో 3.78 లక్షల కార్డుదారులకు మేలు

నారాయణఖేడ్: పేదలకు రేషన్ కార్డులపై సన్న బియ్యంను ఉగాది నుంచి సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చింది. అందుకనుగుణంగా గతంలోనే సన్న బియ్యం సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసినా సన్న బియ్యం లేని కారణంగా వాయిదా వేసి ఉగాది నుంచి అందజేస్తామని ప్రకటించింది. ఉగాది పండుగ సందర్భంగా పథకాన్ని ప్రారంభించి ఏప్రిల్ 1 నుంచి లబ్ధిదారులకు సన్న బియ్యంను అందజేస్తారు. పథకం ద్వారా జిల్లాలో 3.78లక్షల రేషన్ కార్డు దారులకు లబ్ధి చేకూరనుంది. జిల్లాలో 846 రేషన్ దుకాణాల ద్వారా 3.78లక్షల మంది కార్డుదారులకు కార్డులోని సభ్యులు ఒక్కొక్కరికి 6కిలోల చొప్పున 8వేల మెట్రిక్ టన్నుల బియ్యంను అందిస్తున్నారు. జిల్లాలోని కార్డుదారులందరికీ సన్న బియ్యం ద్వారా మేలు చేకూరనుంది.

సీఎం చేతుల మీదుగా..

ఉగాది పర్వదినం రోజైన ఈనెల 30న సన్న బియ్యం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్, సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిల్లో పథకాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్న బియ్యం సరఫరా చేస్తూ రైతులను సన్నాల సాగువైపు మళ్లించాలని సైతం ప్రభుత్వం యోచిస్తోంది. సన్నాలు సాగు చేసిన రైతులకు బోనస్ చెల్లించే పథకాన్ని సైతం అమలు చేస్తోంది. ధాన్యం కనీస మద్దతు ధరపై అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తూ సన్నాల సాగు విస్తీర్ణాన్ని పెంచుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 24లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కావాలని, ఇందుకు 36లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అవసరం అని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ ఏడాదిలో రెండు సీజన్లలో సేకరించే సన్నధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రంలో ఇదివరకు సేకరించిన సన్నవడ్ల ద్వారా మరాడించగా 8లక్షల టన్నులు వచ్చిన సన్న బియ్యం ఆయా పౌరసరఫరాల గోడౌన్లలో నిల్వ ఉంచారు. మిల్లుల్లో ప్రస్తుతం మరాడిస్తున్న సన్న బియ్యం వచ్చే నాలుగు నెలల వరకు సరిపోగలవని ప్రభుత్వం అంచనా వేస్తోంది. సన్న బియ్యం కోసం ఎదురుచూస్తున్న పేదలకు పథకం ద్వారా లబ్ధిచేకూరనుంది.



రీసైక్లింగ్ నిరోధానికే..

పేదలకు ఉచితంగా సరఫరా చేస్తున్న దొడ్డుబియ్యం చాలామంది భోజనానికి ఉపయోగించడం లేదని, దళారులు కిలోకు రూ.10 నుంచి రూ.20లోపు వీరి వద్ద కొనుగోలు చేసి రీసైక్లింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పేదలు తినగలిగే నాణ్యమైన బియ్యాన్ని ఇస్తేనే రీసైక్లింగ్ అక్రమాలను అరికట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. వానాకాలం సీజన్ నుంచి సన్న ధాన్యం సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. సన్నబియ్యం సాగుచేసి విక్రయించిన రైతులకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ కూడా చెల్లిస్తుంది. ఇలా వచ్చిన సన్నవడ్లను మర ఆడించిన సన్నబియ్యంను ఆయా పౌరసరఫరాల గోడౌన్లకు సరఫరా చేసి అక్కడి నుంచి రేషన్ దుకాణాల ద్వారా లబ్దిదారుకు అందించనున్నారు.

తొలిరోజు ప్రశాంతం



సంగారెడ్డిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ పంకజ్

ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పదవ తరగతి పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 122 పరీక్ష కేంద్రాలను నియమించారు. పరీక్ష ఉదయం 9:30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12:30 నిమిషాల వరకు జరిగింది. విద్యార్థులు చివరి నిమిషంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గానూ ఒక గంట ముందుగానే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షకు 5 నిమిషాల సడలింపు ఉండటంతో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష కేంద్రాలకు తరలివచ్చారు. తమ పిల్లలు మొదటిసారి పబ్లిక్ పరీక్షలు రాస్తుండటంతో తల్లిదండ్రులు పెద్ద ఎత్తున కేంద్రాల వద్దకు వచ్చి బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. మరి కొంతమంది తల్లిదండ్రులు మాత్రం పిల్లల పరీక్షలు అయిపోయేంత వరకు కేంద్రం వద్దనే వేచి ఉన్నారు. పదవ తరగతి పరీక్షలలో భాగంగా శుక్రవారం తెలుగు పరీక్ష జరిగింది. జిల్లావ్యాప్తంగా 22,410 మంది విద్యార్థులకు గానూ 22,370 మంది విద్యార్థులు హాజరు కాగా 40 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, ఎక్కడా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 55 పరీక్ష కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. వీటిలో జిల్లాస్థాయి పరిశీలకులు ఉషారాణి 05, కలెక్టర్ వల్లూరు క్రాంతి 02, డీఈవో వెంకటేశ్వర్లు 04, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ పండరీనాయక్ 04, ఫ్లయింగ్ స్క్వాడ్ 40 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ

సంగారెడ్డి పట్టణంలోని రిషి పబ్లిక్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ క్రాంతి, ప్రభుత్వ బాలికల పాఠశాల, కరుణా హైస్కూల్, సాహితీ హైస్కూల్ పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్ష కేంద్రంలో నిర్వహణ, విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలకు తావు లేకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. తనిఖీ సమయంలో కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

100% పన్ను వసూలు

- అధికారులకు కలెక్టర్ క్రాంతి ఆదేశం
- వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి

సంగారెడ్డిజోన్: గ్రామపంచాయతీలలో 100% ఇంటి పన్ను, కుళాయి బిల్లులు వసూలు చేసేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. పంచాయతీలు, మున్సిపాలిటీలలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబాను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వేసవికి ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. అంతకుముందు ఐసీడీఎస్, అజీమ్‌ప్రేమ్ జీ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో 9 వ పూర్వ బాల్య సంరక్షణ విద్యపై నిర్వహించిన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ...అంగన్‌వాడీ కేంద్రాలలో నూతన బోధన పద్ధతులు అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి ఆర్‌జేడీ మోతి, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా పంచాయతీ రాజ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, జిల్లాలోని సీడీపీవోలు, సూపర్ వైజర్లు, టీచర్లు, అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



నియోజకవర్గం ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌కు పండ్లు తినిపిస్తున్న షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్ తదితరులు

ఇఫ్తార్ విందుకు షబ్బీర్ అలీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి చంద్రశేఖర్, టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మల హాజరయ్యారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ, సురేశ్ షెట్కార్‌లు మాట్లాడుతూ...ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అన్నారు. కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్, గిరిధర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ తన్వీర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా బ్యాలెట్‌కు స్పందన భేష్

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో ప్రజా బ్యాలెట్ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 10 సెంటర్లలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపు 13 గ్రామాల ప్రజలు ఈ ప్రజా బ్యాలెట్ కార్యక్రమంలో పాల్గొని స్వచ్ఛందంగా ఓట్లు వేశారు. మొత్తం ఓట్లు 6,449 పోల్ అవగా...అందులో 18 చెల్లని ఓట్లు ఉన్నాయి. ఇక డంపింగ్‌యార్డ్‌కు అనుకూలంగా 1 ఓటు, వ్యతిరేకంగా 6,430 ఓట్లు వేశారని జేఏసీ నాయకులు కొత్తపల్లి మల్లేష్ గౌడ్ ప్రకటించారు. ప్రభుత్వం ప్రజా బ్యాలెట్ కార్యక్రమాన్ని పరిగణనలోకి తీసుకుని తమ న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలని జేఏసీ తరపున విజ్ఞప్తి చేశారు.



ప్యారానగర్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు క్యూలో నిలబడిన మహిళలు



జహీరాబాద్‌లోని బాగారెడ్డిపల్లిలో నిలిచిన వర్షపునీరు..



గంగ్వార్ చౌరస్తా వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



రాంనగర్‌లో తెగిపడిన విద్యుత్ తీగలు

జిల్లాలో పలుచోట్ల అకాల వర్షం

నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ మండలాల్లోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో పక్షం రోజులుగా ఎండ తీవ్రతతో ఉక్కపోతకు గురవుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. అకాల వర్షం కారణంగా ఆయా ప్రాంతాల్లో శనగ, జొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఇక మామిడి పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డిపల్లిలో ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో కరెంట్ సరఫరా నిలిచిపోయియింది. న్యాల్‌కల్ మండలంలోని గంగ్వార్ చౌరస్తా వద్ద వర్షపునీరు నిలవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

నారాయణఖేడ్/న్యాల్‌కల్ (జహీరాబాద్)/జహీరాబాద్ టౌన్/మునిపల్లి :

'ఐలా' ఎన్నికలు రసవత్తరం

- ఏకగ్రీవానికి ఎత్తుకు పైఎత్తులు
- 27న పాలకవర్గ ఎన్నికలు

పటాన్‌చెరువు: పటాన్‌చెరు ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ(ఐలా) పాలకవర్గం ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులను స్క్రూట్నీ దశలోనే పోటీ నుంచి తొలగించాలనే కుట్రలు ఓ వైపు, అలా చేస్తే తాము కోర్టుకైనా వెళ్తామని ఆశావహులు మరోవైపు పట్టుదలగా ఉన్నారు. దీంతో ఈ ఎన్నికల రాజకీయాలు మరింత రసకందాయకంలో పడ్డాయి. ఐలా పాలకవర్గానికి మొత్తం 17 పదవులున్నాయి. చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులతోపాటు ఇతర సభ్య స్థానాలకు పోటీ జరుగనుంది. ఇందుకు నోటిఫికేషన్ ఈ నెల 5న వెలువడింది. ఈ నెల 19కే నామినేషన్ దాఖలు ప్రక్రియ ముగిసింది. స్క్రూట్నీ అభ్యర్థుల ప్రక్రియ శనివారం నాటికి తేలనుంది. ఇంతలోనే కొందరు వ్యక్తులు చక్రం తిప్పి ఐలా పాలక వర్గాన్ని తమ గుప్పిట్లోనే పెట్టుకోవాలని చేస్తున్న రాజకీయాలపై కొందరు పారిశ్రామికవేత్తలు ముక్కున వేలేసుకుంటున్నారు.

నేడు పేర్లు ఖరారు

శనివారం నాటికి బరిలో నిలిచే వ్యక్తుల పేర్లు ఖరారు కానున్నాయి. ఒక వర్గం తమ అనుచరులు లేదా ప్యానెల్‌కు చెందిన వారే చైర్మన్‌గా ఇతర అన్ని పదవులకు పోటీ చేయాలని ఎన్నికలు ఏకగ్రీవం కావాలని చేస్తున్న ప్రయత్నాలు సాధారణ ఎన్నికల రాజకీయాలకు మించి తలపిస్తున్నాయి. ఇక రెండో వర్గం వారు కూడా కోర్టుల వరకు వెళ్లే పరిస్థితి నెలకొంది. సభ్యత్వాల నమోదు కూడా లోపభూయిష్టంగా జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. అంటే ఓటర్ల జాబితా తయారీలో కూడా తమకు అనుకూలమైన వ్యక్తుల పేరిట సభ్యత్వాలు ముందుగానే తీసుకున్నారని తెలుస్తోంది. దాదాపు ఇందుకోసం ఓ వర్గం రూ.1.40లక్షలు సొంత సొమ్మును కట్టి సభ్యుల పేరిట సభ్యత్వాల రశీదులను ఈ నెల 13,14 తేదీల్లో తీసుకున్నట్లు తెలుస్తోంది. చైర్మన్ పదవిని ఆశిస్తున్న ఒకరు ఆయనతోపాటు మరికొందరు ఒక కోటరీగా ఏర్పడి సభ్యత్వాల నమోదు ప్రక్రియను పూర్తి చేశారు. ఒక పారిశ్రామికవేత్త ఎన్నికల్లో పోటీ చేస్తుంటే ఆయనను తప్పించేందుకు ఆయనపై లేనిపోని విమర్శలు చేసి అనర్హుడిగా ప్రకటించాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పటాన్‌చెరు ఐలా చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున రాజకీయాలు ఎప్పుడూ జరగలేదని పారిశ్రామికవేత్తలు చర్చించుకుంటున్నారు.



పారిశ్రామికవాడ

చైర్మన్ పదవి రేసులో ప్రముఖులు

చైర్మన్ పదవి రేసులో బాసిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సుధీర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి లాంటి ప్రముఖులున్నారు. అయితే అన్ని పదవులకు పోటీ గట్టిగానే ఉంది. ప్రధానంగా అన్ని స్థానాలు ఏకగ్రీవంగా జరగాలని ఒక వర్గం గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ఐలా పరిధిలో దాదాపు 450 ఇండస్ట్రియల్ ప్లాంట్లు ఉండగా అందులో మొత్తం 379 పారిశ్రామికవేత్తలు తమ పాలక వర్గాన్ని ఎన్నుకునేందుకు ఓటర్లు లేదా అర్హులైన సభ్యులు ఉన్నారు.

క్లుప్తంగా

మూడు వారాలకే కాత

బీర పంటతో అధిక లాభాలు

జిల్లా ఉద్యాన అధికారి బాలాజీ



బీర తోటను పరిశీలిస్తున్న బాలాజీ

అక్కన్నపేట(హుస్నాబాద్): విత్తన ప్రక్రియ ఆరంభమైన మూడు వారాలకే కాతకు రావడం బీర పంట ప్రత్యేకత అని జిల్లా ఉద్యాన అధికారి బాలాజీ అన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి గ్రామంలో రైతు స్వామిరెడ్డి సాగు చేసిన బీర తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న కూరగాయల్లో బీర ఒకటి అన్నారు. అలాగే అధిక డిమాండ్ కల్గి ఉండి తొందరగా చేతికందు పంట బీర అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తర ణాధికారి కరంటోతు శ్రీలత పాల్గొన్నారు.

నిందితుడి రిమాండ్

ములుగు(గజ్వేల్): ములుగు మండలం బహిలంపూర్ ఆర్అండ్ఆర్ కాలనీలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు పెంటమీది స్వామిని శుక్రవారం అదుపులోకి తీసుకొని గజ్వేల్ కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. అత్యాచారానికి గురైన బాలికకు గజ్వేల్ ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సిద్దిపేటఅర్బన్: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరు గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. సిద్దిపేట త్రీటౌన్ పోలీసుల కథనం మేరకు.. వెల్కటూరు శివారులో కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాట వెలికట్టుకు చెందిన పెరుగు కిష్టయ్య, పొన్నాలకు చెందిన లెంకల కనకయ్య, మర్పడగకు చెందిన వల్లపు కనకయ్య, దుద్దెడకు చెందిన మహ్మద్ నహీం పట్టుబడ్డారు. నాంచారుపల్లికి చెందిన రాము, వెల్కటూరుకు చెందిన కిషన్, సిద్దిపేటకు చెందిన చారి పరారీలో ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ. 9480 నగదు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

లారీలో బస్తాలను లోడ్ చేస్తూ..

ప్రమాదవశాత్తు కిందపడి హమాలీ మృతి

వర్గల్(గజ్వేల్): వడ్ల బస్తాలను లారీలో లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి హమాలీ మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం వర్గల్ మండలం శాకారంలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. ఒరిస్సా రాష్ట్రం పార్లకేముండి గ్రామానికి చెందిన బీరా ప్రకాశ్(43) ఉపాధి నిమిత్తం ఆరు నెలల కిందట వచ్చి భార్య, కుమారుడితో కలిసి మేడ్చల్ సమీప ఎల్లంపేట గ్రామంలో ఉంటున్నాడు. శుక్రవారం బీరా ప్రకాశ్ తదితరులు వర్గల్ మండలం శాకారంలోని శ్రీసాయి బిన్నీ మోడ్రన్ రైస్‌మిల్‌లో వడ్ల బస్తాలను లారీలో లోడ్ చేసేందుకొచ్చారు. లోడ్ చేస్తుండగా లారీ బస్తాల పైన ఉన్న బీరా ప్రకాశ్ ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు బీరా హరీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

మిరుదొడ్డి(దుబ్బాక: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కాసులాబాద్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పరుశరామ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బిట్ల రాములు (75) వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. 2012లో భార్య చనిపోగా ముగ్గురు ఆడపిల్లల వివాహాలు చేశాడు. గురువారం సాయంత్రం రాములు వ్యవసాయ పొలం సమీపంలో చింత చెట్టు ఎక్కి కాయలు తెంపుతున్నాడు. ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి అన్న మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



రాములు (ఫైల్)

ఎర్రరాయి వాహనాలు సీజ్

న్యాల్‌కల్(జహీరాబాద్): అక్రమంగా ఎర్రరాయి తరలిస్తున్న రెండు వాహనాలను పట్టుకున్నట్లు హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలో న్యామతాబాద్, రేజింతల్, గణేశ్‌పూర్ గ్రామ శివారులోంచి లారీ, ట్రాక్టర్లలో ఎర్రరాయి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. హుస్సెళ్లి సరిహద్దు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో ఎలాంటి పత్రాలు లేకుండా ఎర్రరాయిని తరలిస్తున్న లారీ, ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. రెండు వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 15వ తేదీన గణేశ్‌పూర్ గ్రామ శివారులో ఒక వాహనాన్ని సీజ్ చేసిన విషయం తెలిసిందే.

నిలువ నీడ లేదు.. వైద్యం జాడలేదు

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కానరాని వసతులు

గ్రామాల్లో వలసలు నివారించి స్థానికంగా ఉపాధి కల్పించాలన్నది ఉపాధి హామీ లక్ష్యం. ఈ క్రమంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరుతో ప్రతీ ఏటా గ్రామాల్లో ఉపాధి పనులు చేపడుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో విస్తృతంగా పనులు కల్పిస్తున్నప్పటికీ అదే రీతిలో తగిన వసతులు కల్పించడం లేదు. ఉపాధి కూలీలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు టెంట్లు, తాగునీటి వసతి, అత్యవసర సమయాలకు ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఈ సదుపాయాలు జిల్లాలో ఎక్కడా అమలు కావడంలేదు.

– సంగారెడ్డి జోన్/నారాయణఖేడ్



ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీలు



- ఏళ్లుగా అందని పరికరాలు
- అత్యవసర మెడికల్ కిట్లు, టెంట్లు కరువు
- గాయాలైతే ఆరోగ్య కేంద్రానికి పరుగులు
- చెట్ల కిందే సేద తీరుతున్న కూలీలు
- తాగు నీటి వసతి అంతంతే
- వడదెబ్బకు నారాయణఖేడ్ మండలం ర్యాకల్‌లో ఒకరు మృతి

ఉపాధి హామీ పథకంలో పనులు చేసే వారికి పదేళ్ల క్రితం పనిముట్లు, టెంట్లు పంపిణీ చేశారు. గ్రూపులో ఉన్న నలుగురు సభ్యులకు కలిపి నాలుగు గుంతలు తవ్వేందుకు గడ్డపారలను అందించారు. అప్పటినుంచీ ఇప్పటివరకు తిరిగి ఎలాంటి పనిముట్లు అందించలేదు. దీంతో కూలీలే తాము కొనుగోలు సొంత పనిముట్లు తీసుకువచ్చి పనులు ముగిస్తున్నారు. పనిముట్లకు సంబంధించి ఎలాంటి భత్యం చెల్లించడం లేదని తెలుపుతున్నారు.

కనిపించని మెడికల్ కిట్లు

పనులు చేసే సమయంలో ప్రమాదవశాత్తు గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించేందుకుగాను మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి. కానీ, ఎక్కడ చూసినా పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు కనిపించడం లేదు. పలుమార్లు ఉపాధి కూలీలకు గాయాలైతే స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. అదేవిధంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా పంపిణీ చేయడం లేదని కూలీలు తెలిపారు.

గొలుసుటెంట్లు లేక.. చెట్ల కింద సేద

రోజురోజుకు ఎండలు ముదురుతున్నాయి. ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి బయటకు రావాలంటే ప్రతీ ఒక్కరు జంకుతున్నారు. ప్రతీరోజు ఉదయం 7 గంటల నుంచి 10:30 వరకు పనులు చేస్తున్నారు. పనులు ముగిసిన తర్వాత ఆన్‌లైన్ విధానంలో కూలీల హాజరు వేస్తుంటారు. ఆ సమయంలో పనులు చేసిన పరిసరాల్లో చెట్లు ఉంటే సేద తీరుతున్నారు.

వేడిగా తాగునీరు

వేసవిలో ఎక్కువగా నీరు తాగాలని వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. పనులకు వెళ్లిన సమయంలో కూలీలు తమ ఇంటి నుంచి నీటిని బాటిళ్లలో తీసుకు వెళ్తున్నారు. పెరుగుతున్న ఎండలకు ఇంటి నుంచి తీసుకువెళ్లిన తాగునీరు పూర్తిగా వేడిగా మారుతున్నాయని తాగలేకపోతున్నామని ఉపాధి హామీ కూలీలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న కూలీల సంఖ్య

ఉపాధి హామీ పథకంలో రోజురోజుకీ కూలీల సంఖ్య పెరుగుతుంది. జాబ్ కార్డు కలిగి ఉండి అర్హులైన ప్రతీ ఒక్కరికి పనులు కల్పిస్తున్నారు. దీంతో ఉపాధి పనులపై ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లాలో 1,32,000 మందికి జాబ్ కార్డులు ఉండగా రెండు లక్షల 25 వేల మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం రోజుకు 35 వేలకు పైగా మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. కానీ, కూలీలకు వసతులు కల్పించడంలో అధికారులు విఫలం అవుతున్నారు.

నాలుగేళ్లుగా అదనపు భత్యం బంద్

ఉపాధి కూలీలు వేసవిలో చేసే పని ప్రదేశాల్లో భూమి వేడిమి వల్ల గట్టిగా ఉండడం, పొద్దు స్తమానం పని చేయలేని పరిస్థితి ఉండటంతో అదనపు భత్యం చెల్లించాల్సి ఉంటుంది. గతంలో మార్చిలో 20 శాతం, ఏప్రిల్‌లో 25 శాతం, మేలో 30 శాతం అదనపు కూలి చెల్లించేవారు. కానీ నాలుగేళ్లుగా ఈ అదనపు కూలి చెల్లించడం లేదు. గతంలో రాగాస్ సాఫ్ట్‌వేర్ ద్వారా నమోదు చేసే సందర్భాల్లో అదనపు చెల్లింపులు నమోదుకు అవకాశం ఉండే. ప్రస్తుతం ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్) సాఫ్ట్‌వేర్ వాడుతుండడం, కేంద్రం నేరుగా ఈ సాఫ్ట్‌వేర్ రూపొందించి వినియోగిస్తుండడంతో అదనపు కూలి చెల్లింపుల నమోదుకు అవకాశం లేకుండా పోయిందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో డైవర్షన్ డ్రైన్, రాకళ్ల కట్టలు, ఫీడర్ ఛానెల్, ఎంఐ ట్యాంక్, పశువులు, గొర్ల షెడ్లు, కోళ్ల ఫారాల నిర్మాణం, చెక్‌డ్యాం, ఫామ్ పండ్, ఫార్మేషన్ రోడ్డు పనులు సాగుతున్నాయి. ఈ పనులన్నీ దాదాపు ఎండపట్టునే చేయాల్సి ఉటుంది.

జిల్లాలో యాక్టీవ్ జాబ్ కార్డులు	1,32,000
రోజు హాజరయ్యే కూలీలు	35,000లకు పైగా



ఎండలోనే హాజరు వేస్తున్న ఖేడ్ ఏపీఓ

పరికరాలు అందించాలి

ప్రతీ సంవత్సరం ఉపాధి హామీలో పనులు చేస్తున్నాం. పనులు నిర్వహించేందుకు అవసరమయ్యే పనిముట్లు కల్పించాలి. ఆమె సొంతంగా తీసుకువచ్చి పనులు చేస్తున్నాం. పనిముట్లకు అదనంగా ఎలాంటి భత్యం చెల్లించడం లేదు.



-నింగమ్మ, ఉపాధి హామీ కూలీ, గ్రామం కక్కర్ వాడ, మం.ఝరాసంగం

తాగు నీటిని ఏర్పాటు చేయాలి

ఉపాధి పని ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఇంటి నుంచి తీసుకువెళ్లిన నీరు వేడెక్కిపోవడంతో పాటు సరిపోవడం లేదు. అధికారులు చర్యలు తీసుకొని అవసరం మేరకు తాగునీటి వసతి కల్పించాలి.



-అహ్మద్, ఉపాధిహామీ కూలీ, గ్రామం మల్కాపూర్, మం.హత్నూర

వసతులు కల్పించేందుకు చర్యలు

జిల్లాలో ఉపాధి హామీలో భాగంగా పనుల ప్రదేశాలలో వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వసతులు లేని ప్రదేశాలను గుర్తించి ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లతోపాటు ప్రాథమిక చికిత్స కోసం మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించాం.



- బాలరాజ్, అదనపు డీఆర్డీవో, సంగారెడ్డి జిల్లా

వడదెబ్బతో మహిళా కూలీ మృతి



బోయిని లచ్చవ్వ

నారాయణఖేడ్: వడదెబ్బతో ఉపాధి హామీ మహిళా కూలీ మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా ఖేడ్ మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. తోటి కూలీల కథనం మేరకు.. ఖేడ్ మండలం ర్యాకల్ గ్రామ శివారులో ఉపాధి హామీ కింద కొద్ది రోజులుగా కాల్వ తవ్వకం పనులు జరుగుతున్నాయి. రోజూలాగే శుక్రవారం గ్రామానికి చెందిన బోయిని లచ్చవ్వ (52) పనులకు వెళ్లింది. పనులు చేస్తున్న క్రమంలో అస్వస్థతకు గురై స్పృహ తప్పి కిందపడిపోయింది. తోటి కూలీలు ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భర్త బోయిని భూమయ్య రెండేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఏఐతో భారత్‌కే అధిక లాభం

జీసీ గురుకుల సంస్థల జాయింట్ సెక్రటరీ శ్యామ్‌ప్రసాద్‌లాల్



శ్యామ్‌ప్రసాద్‌లాల్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, తదితరులు

వర్గల్(గజ్వేల్): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగంతో అధిక లాభం పొందేది భారతదేశమేనని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల సంస్థల జాయింట్ సెక్రటరీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. వర్గల్ పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ విభాగం అధికారులు 'మర్జింగ్ ట్రెండ్స్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సును శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఏఐ వల్ల కలిగే లాభనష్టాలను వివరించారు. సదస్సులల్లో విద్యార్థులందరూ చురుగ్గా పాల్గొనాలని సూచించారు. పది మందికి ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదగాలన్నారు. సదస్సులో చెన్నై విశ్వేశ్వరయ్య యూనివర్సిటీ, ఘట్కేసర్ శ్రీనిధి యూనివర్సిటీ, గవర్నమెంట్ సిటీ కాలేజీ, అరోరా కాలేజీ, సోషల్ వెల్ఫేర్ కాలేజీలు, నల్గొండ మహాత్మాగాంధీ యూనివర్సిటీ, వరంగల్ కాకతీయ యూనివర్సిటీ, హైద్రాబాద్ జేఎన్‌టీయూ, ఉస్మానియా యూనివర్సిటీల రీసెర్చ్ విద్యార్థులు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు. వీటి సారాంశాన్ని సావెనీర్‌గా రూపొందించారు. సదస్సులో శ్రీనిధి యూనివర్సిటీ ప్రొఫెసర్ పద్మ, రాధిక, సాహెలీ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు, వైస్‌ప్రిన్సిపాల్ గోవిందరావు, ఏటీపీ ఉమామహేశ్వరి, డాక్టర్ నిఖిత, డాక్టర్ రాధారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషన్ పేరుతో ఫేక్ కాల్స్

ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలని వ్యాపారులకు ఫోన్

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట మున్సిపల్ కమిషనర్ ఉమా పేరుతో సైబర్ కేటుగాళ్లు ఫేక్ కాల్స్ చేయడం కలకలం రేపింది. ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలని రెన్యువల్ చేసుకోవాలని, మిషన్ భగీరథ బిల్లులు చెల్లించాలని శుక్రవారం ఉదయం నుంచి వ్యాపారులకు సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేయడంతో ఒక్కసారిగా కంగుతిన్నారు. అనుమానం రావడంతో విషయాన్ని వ్యాపారులు కమిషనర్‌కు చెప్పారు. మున్సిపల్ బిల్ కలెక్టర్లకు గాని మున్సిపల్ అధికారిక ఖాతాలో మాత్రమే బిల్లులు చెల్లించాలని ఇలాంటి ఫేక్ కాల్స్ నమ్మొద్దని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఉమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు.

కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఒకరు మృతి



ప్రమాద స్థలిలో కారు, బస్సు

కొల్చారం(నర్సాపూర్): ఎదురుగా వస్తున్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కారు డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రం సమీపంలో మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారి లోతు వాగు సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. కౌడిపల్లి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పిల్లి మల్లేశం (38) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పని నిమిత్తం మెదక్‌కు కారులో వచ్చాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో మండల శివారులోని జాతీయ రహదారి లోతు వాగు మలుపు వద్దకు రాగానే సికింద్రాబాద్ వైపు నుంచి మెదక్ వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బ తినడంతోపాటు డ్రైవర్ మల్లేశంకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మరో ప్రమాదంలో మహిళ

రాయికోడ్ (అందోల్): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని సింగితం గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణ కథనం మేరకు.. రేగోడ్ మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన మణెమ్మ (53) రాయికోడ్ మండలం హస్నాబాద్‌లో బంధువుల శుభకార్యానికి గురువారం బొలెరో వాహనంలో కులస్తులతో హాజరయ్యారు. సాయంత్రం తిరుగు ప్రయాణం కాగా సింగితం గ్రామానికి చేరుకోగానే బొలెరో వాహనం అదుపుతప్పింది. ప్రమాదంలో తీవ్ర గాయాలై మణెమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బొలెరో వాహన డ్రైవర్ రాములుపై మృతురాలి భర్త నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ అదుపుతప్పి కూలీ..

దుబ్బాకటౌన్ : ద్విచక్ర వాహనం అదుపుతప్పి కూలీ మృతి చెందిన ఘటన రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామ పరిధిలోని గుర్రాలసోఫా వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. శుక్రవారం రాయపోల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా చేగుంట మండలం కసాన్‌పల్లి గ్రామానికి చెందిన లింగ రమేశ్ (39) వ్యవసాయం, సెంట్రింగ్ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ప్రతిరోజూ గజ్వేల్ పట్టణానికి సెంట్రింగ్ కూలి పనికి బైక్‌పై వెళ్తుంటాడు. గురువారం రాత్రి పని ముగించుకొని ఇంటికి వెళ్లే క్రమంలో వడ్డేపల్లి గ్రామ పరిధిలోని గుర్రాలసోఫా సమీపంలో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపారు.

ఆటో బోల్తా పడి మహిళ..

కొమురవెల్లి(సిద్దిపేట): ఆటో బోల్తా పడి మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు కథనం మేరకు.. వరంగల్ కాశీబుగ్గకు చెందిన సబిత(55) కుటుంబంతో కలిసి కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చారు. తిరిగి వెళ్లే క్రమంలో వేచరేణి కి చెందిన ఆటోలో బయలు దేరారు. మండల కేంద్రంలోని పద్మశ్రీ గార్డెన్ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సబిత మృతి చెందగా, పలువురి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

50 శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్(ఎస్ఎంఏఎం) పథకం ద్వారా 50శాతం రాయితీతో మహిళా రైతులకు వ్యవసాయ పరికరాలు అందించనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక శుక్రవారం తెలిపారు. రాయితీని పొందేందుకు మహిళల పేరుపై భూమి నమోదై ఉండాలన్నారు. పంటల రక్షణ పరికరాలు, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు, డ్రోన్, ట్రాక్టర్ రోటవేటర్, సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్, కల్టివేటర్, డిస్క్‌హర్యో, కేజ్‌వీల్స్, రోటో పడ్లర్, పవర్ టిల్లర్, బ్రష్‌కట్టర్, పవర్ వెడ్డర్, స్ట్రా బలేర్, ట్రాక్టర్లు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి కల్గిన మహిళా రైతులు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

చెరువులో మునిగి విద్యార్థి మృతి



బాలుడు రిస్విత్ మృతదేహం

రామాయంపేట(మెదక్): చెరువులో మునిగి బాలుడు మృతి చెందిన ఘటన శుక్రవారం రామాయంపేట మండల పరిధిలోని కాట్రియాల గ్రామంలో చోటు చేసకుంది. పోలీసుల కథనం మేరకు.. కాట్రియాల గ్రామానికి చెందిన కాస రాజు కుమారుడు రిస్విత్(12), బాబాయి కుమారుడు రేవంత్, మరో ఇద్దరు విద్యార్థులతో కలిసి గ్రామ శివారులోని పెద్ద చెరువులో ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగి రిస్విత్ మృతి చెందాడు. మృతుని తండ్రి కాస రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రిస్విత్ ఏడవ తరగతి చదువుతుండగా ఒంటి పూట బడులు కావడంతో విద్యార్థులతో కలిసి ఈతకు వెళ్లాడు.

అంగడి వేలం రెండోసారి వాయిదా

హుస్నాబాద్: వారాంతపు సంత బహిరంగ వేలం పాట శుక్రవారం మరోసారి వాయిదా పడింది. వివరాల్లోకి వెళ్తే.. 17న మొదటి సారి బహిరంగ వేలం పాట నిర్వహించారు. గతేడాది అంగడి వేలం రూ. కోటి 20 లక్షల 26 వేలు పలికింది. దీనికి అదనంగా 5 శాతం కలిపి రూ. కోటి 26 లక్షల 27 వేల 300కు సర్కార్ పాటను ప్రారంభించారు. వేలం పాటను తగ్గించాలని గుత్తేదారులు ఎవరూ పాట పాడకపోవడంతో వేలం వాయిదా వేశారు. ఈ విషయాన్ని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ దృష్టికి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తీసుకెళ్లారు. వేలంను తగ్గించేది లేదని నిబంధనల ప్రకారం అంగడి వేలం పాటను నిర్వహించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మరోసారి నిర్వహించారు. గుత్తేదారులు మెట్టు దిగకుండా వేలం పాటను తగ్గించాలని డిమాండ్ చేశారు. తగ్గించిన తర్వాతే వేలంలో పాల్గొంటామని వెనుదిరిగి వెళ్లిపోయారు. దీంతో రెండోసారి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.



న్యాయమూర్తి సాయి రమాదేవి, ఇతర అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారమే..

- దుబ్బాక పట్టణంలో కోర్టు కాంప్లెక్స్ భవన నిర్మాణం
- స్థల పరిశీలనలో కలెక్టర్ మనుచౌదరి, జిల్లా జడ్జి సాయి రమాదేవి

దుబ్బాక : సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారమే కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతామని కలెక్టర్ మనుచౌదరి, జిల్లా జడ్జి సాయిరమాదేవి అన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణంలో కోర్టు భవనం నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు కమిటీ మేరకు కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి 4 ఎకరాల స్థలం కేటాయించాలన్నారు. జిల్లా న్యాయ, రెవెన్యూ, మున్సిపల్, ఆర్అండ్‌బీ ఇతర అధికారులందరూ కలిసి దుబ్బాకలో కోర్టు నిర్మాణానికి 1.32 ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందన్నారు. రెవెన్యూ, సర్వే అధికారులు పూర్తి ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. త్వరలోనే స్థల సేకరణ పూర్తిచేసి భవన నిర్మాణం ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీడీవో భాస్కరశర్మతో పాటు అధికారులు పాల్గొన్నారు.

పలు కార్యాలయాల సందర్శన

పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ మనుచౌదరి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే సమీకృత కార్యాలయాల భవన సముదాయాన్ని పరిశీలించారు. ఖాళీగా ఉన్న గదులు ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించేందుకు సంబంధిత అధికారులతో చర్చించాలని తహసీల్దార్ సంజీవ్‌కు సూచించారు.

అప్పులు భారమై.. మద్యానికి బానిసై


ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం



నర్సింలు

వర్గల్(గజ్వేల్): చేసిన అప్పులు భారమై, మద్యానికి బానిసై వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన శుక్రవారం వర్గల్ మండల కేంద్రంలో వెలుగుచూసింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డి కథనం మేరకు.. వర్గల్‌కు చెందిన కిస్టనోళ్ల నర్సింలు(58) హమాలీ. భార్య అండాలు, కూతురు, కుమారుడు ఉన్నారు. రూ.10 లక్షల వరకు అప్పు చేసి ఏడాదిన్నర కిందట కూతురి వివాహం చేశాడు. కాలికి గాయం కావడంతో నాలుగు నెలల నుంచి ఏ పని చేయకుండా ఇంటి వద్దే ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి మద్యం తాగి వచ్చిన భర్తను రోజు తాగి వస్తే అప్పు ఎలా తీరుతుందని భార్య మందలించింది. దీంతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కౌలుకు తీసుకున్న పొలంలో శుక్రవారం ఉదయం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి..



మల్లేశ్ యాదవ్

శివ్వంపేట (నర్సాపూర్): ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధి గూడూరు గ్రామానికి చెందిన బోయిని మల్లేశ్ యాదవ్ (45) ఆర్థిక ఇబ్బందులతోపాటు మద్యానికి బానిసయ్యాడు. ఐదు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని కుళ్లిన స్థితిలో మృతదేహం కనిపించింది. గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

టామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విష్ణు వర్ధన్, సెక్రటరీ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.